# కన్నె గులాబీలు

కమ్ముకుని వికసించిన గులాబీపూలు, ఎవరన్నా కోసుకుంటారేమోనని, ఎత్తుగా ఉన్న గోడమీదుగా కొమ్మలెవరికి అందవు. యౌవనపు ముమ్మరంతో చూసినవారిని సొమ్మసిల్లచేసే ఆ కొమ్మకూడా ఎంద రెన్నివిధముల ఉవ్విళ్ళూరినా ఎవరికీ అందదు.

వెన్నెల రాత్రుల్లో చంద్రశిలా సవిధ సీమను తరంగితమయే గీతికారసవాహినికోసం చాలామంది కాచుకునీ ఉంటారు. హాయిగా పాట విని, ఆ నవమోహిని పొరబాటుననైనా కనబడుతుందేమోనని ఎత్తిన తలలు వంచకుండా చూసిచూసి, భగ్నహృదయాలతో తిరిగిపోతూంటారు. కాని, ఆ అమ్మాయితో స్నేహం...దర్శనం...

* * * *

సుందరం మదరాసు ఎందుకు వచ్చాడో అతనికే తెలియదు. బయలుదేరినది అసలు ఎక్కడికో తెలియదు. కాని, చల్లగాలికి బీచివద్దకు చేరుకున్న తర్వాతనైనా రేడియో అవలంబనాన బొంగురు గొంతుతో అరవపాట వినబడేదాకా, తాను చివరకు అక్కడ తేలాననే విమర్శనే లేదు. చిత్రశోభలులేని సామాన్య సంసారికజీవనం అతనికి నచ్చలేదు. కాంచన సమృద్ధి కలిగిన, కాంతాసమ్మితత్వము కలలోనైనా అనుభవించని యోగంచేత అర్థంచేసుకోలేని ఆవేదనతో సంతోషం తెప్పించుకోవాలని...దాన్ని వెదుక్కుంటూ, దోవ తెలియకుండా తిరుగుతున్నాడు.

పట్నంగూడా పాతబడిపోయింది నాలుగురోజుల్లోనే అతనికి. ఏమీ తోచదు. కాలం గడవడానికి మార్గాలు కనిపించడం లేదు. స్నేహితులమాట ఎత్తటంతోనే ఎక్కడలేని విసుపూ వచ్చేది. ఏదైనా రచించడానికి యత్నంచేసినా...మరల చదువుకునేటప్పటికి రసవిహీనంగా, జీవకళ కొరవడినట్టుగా తోచి, నిస్పృహతో వ్రాసినవాటిని చించివేసేవాడు.

తోడివారందరూ ఎందుకు...ఎలా, సంతోషంగా ఉండగలరో అతనికి అర్థమయ్యేదికాదు. తనకు ఏమి కావలెనో దేనిని అన్వేషించుచున్నాడో తెలియదు. ఎరుగున్నవాళ్ళు ఈ విపరీతపు ఆవేదనను ప్రవర్తనను చూసి, కవికి అలవడే లక్షణాలలో అది ఒకటని, లక్ష్యపెట్టకుండా ఊరుకునేవారు. క్రమంగా ఎవరిసహచర్యాన్ని యిచ్చగింపకుండా ఒంటరిగా షికారు బయలుదేరటం మొదలుపెట్టాడు.; కాని ఏమీ లాభం కనిపించటంలేదు. పార్థసారథి దర్శనంకోసం శుక్రవారంనాడు తయారయ్యే తమిళాంగనా పద్మవ్యూహాన్ని బలవంతాన ఛేదించుకుంటూ వెళ్ళే అవసరాల్లోనైనా అల్లుకుపోయిన అంత అందముకూడా, అతనిని లాలసుని చేసేదికాదు. వాల్చూపులూ, చిరునగవులూ లక్ష్యపెట్టడం అలవాటైందికాదు.

* * * *

మంచుతెరలు ఇంకా కమ్ముకుని ఉండటంచేత ఎండ బాగా పురివిప్పలేదు.

సుందరం మైలాపూరులో ఆ – వీధినే నడచివెళుతున్నాడు. అక్కడికి.. ఆ మేడప్రాంతాలకి వచ్చేటప్పటికి కొంచెం నెమ్మదిగా అడుగు వేశాడు,– సమీపించి, ఆ చక్కదనాన్ని చూస్తూ సాఫుగా ఆగిపోయినాడు.

కనపడ్డవి హిమానీ సంస్పర్శచేత రసార్ద్రములైన గులాబీపూలు:

అవి పలుకరించినట్లుగా అయింది అతనికి. ప్రహరీ వద్దకు వెళ్ళాడు. బరువుగా ఉండడంచేత కొమ్మలు అందుబాటులోనే ఉన్నవి. పూలని – చూసి సంతోషిస్తూ నిలబడినాడు.

పూలదొంతరల మీదుగా – మేడమీద – ఆ అమ్మాయి... కనబడ్డది.

ఆ దృష్టితోనే ఆ పిల్లవంక చూసి, అక్కడ నిలువకుండా నడచిపోయినాడు.

మరునాడు... ఆ వేళకే... అక్కడికి వచ్చి, గులాబీల చిరునగవును గమనించాడు. ఊరుకోలేక, వాటిని కోమలంగా స్పృశించి, పరవశుడైనాడు. ఆ అమ్మాయి అందుబాటుగానే కనబడ్డది. కాని, చేయి చెప్పినమాట వినలేదు... ముందుకు సాగలేదు.

నవోదయముతో కోరికలు విజృంభించినవి. తనవి– తనకోసమే వికసించినవి – తనకు కావాలి అనుకున్నాడు; పూసిన పూలన్నీ... మొగ్గలను మాత్రము కనికరించి విడిచాడు.

కనబడకుండానే ఆ అమ్మాయి తోటలోనుంచి తీయని గొంతుతో "ఎవరు అలా కొమ్మలు లాగేది?" అని కసిరినట్టుగా అడిగింది.

అతడు ఆనవాలుపట్టి పులకితుడైనాడు. జవాబు ఏమీ చెప్పకముందే... ఏమి చెప్పాలో తెలియకముందే... ఆ అమ్మాయి కనిపించింది. గ్రీన్ హౌస్ తిన్నెమీద నిలుచుని ఉన్నది. మొగం మాత్రము అగుపడుతూన్నది.

"ఎవరు... నీ... మీరు?"

సుందరం కొంచెం తటపటాయించి, "నే.....ను" అన్నాడు.

ఆ అమ్మాయి, చిరునగవుతో చూసి... చూస్తూ ఊరుకున్నది...

"పూలు... కోసుకోవచ్చునా?" అని అతడు సిగ్గుపడుతూ ప్రశ్నించాడు.

నవ్వుతూ... అతనివంక చూస్తూనే "మొగ్గలు... కూడా కావలిసుంటే..." అని తనలోతాను నవ్వుకున్నది ఆమె.

సుందరం అమాయకంగా నవ్వుతూ గోడమీదికి... ఎగువకు... చేజాపి–

"ఇవి... మీరు... తీసుకోండి" – అని కోసిన పూలను అందీయబోయినాడు.

ఆమె వద్దని సైగతో బదులు చెప్పింది. చిన్నబోయి తరువాత కథ ఎలా నడపాలో తెలియక చూస్తూ నిలువబడిపోయినాడు. ఏమీ మాటాడలేదు అమ్మాయి. రోషంతో అభిమానంతో వెనుదిరిగి నాలుగు అడుగులువేసి...ఇక మనస్సు పట్టలేక మళ్ళా అక్కడికే తిరిగివచ్చాడు.

ఇంకా అలాగే నిలువబడివున్నది. అతని రాక చూసి బహుళార్థసంభరితమైన అపాంగవీక్షణ కటాక్షముతో దిగిపోయింది.

"వెన్నెల వస్తేనేకాని...జాజులు...వికసించవు..." అని ఆ అమ్మాయి పలుకులే విస్పష్టంగా వినపడ్డాయి.

*　　*　　*　　*

ఆ రోజంతా ఏలా గడిచిపోయిందో సుందరానికే తెలియదు. చంద్రుడికన్న తాను ముందుగా బయలుదేరడానికి పంతము పట్టినట్లు సహనమనేమాటే లేకపోయింది. కాని, మామరాకతోకాని మనసులోని కోరికలు తీర్చేందుకు మాకుమారుడుకూడా అయత్తుడు కాడు గాదూ?

ఎవరినీ లక్ష్యం సేయనట్లు యకాయకిని రాచబాటను నిర్భయముగా తోటలో ప్రవేశించాడు సుందరం. ఎవరినీ కన్మోరగి రానవసరములేని వైఖరిలో ఆమె సమీపించింది.

ఎవరు ముందు కౌగలించుకున్నారో, ఎంతసేపలా ఉండిపోయినారో...ఎవరికీ తెలియదు. కాని ఆ అనుభవానంద సముద్రంలో రేకలుగా విడిపోతూ, గులాబీలన్నీ సన్నజాజుల సైదోడున అవాఙ్మధురధోరణిలో అబ్బ! అనినట్లయింది. విడని కౌగిలిని, విడువజాలని హృదయంతో, విడిపించుకుంటూ, ఆ అమ్మాయికూడా "అబ్బ" అన్నది. అంతచక్కగా అనగలిగిన పెదవులను అతడు సత్కరించాడు.

"నేను...నీతో...మాటాడను" అన్నది ఆ అమ్మాయి.

సుందరం మరీ దగ్గరగా కదలి "పోనీలే..."అన్నాడు. చిన్నపిల్లల మారాంలాగా - "నా... పూలన్నీ..." అని ఆ భంగిమం నిలుపలేక నవ్వేసింది.

"మరి...ఎందుకు మాటాడావు?"

ఇద్దరూ ఒకరినిచూసి ఒకరు...ఒకమారే కలసి నవ్వుకున్నారు.

తమ చెలిమి నభిలషించలేదని కలువరిస్తూన్న జాజులతో తన నెచ్చెలివేణిని అలంకరించాడు. ఎంతో వెదికి మారుమూలల ఆకులమాటున అణగిమణగి సిగ్గుపడుతూన్న ఒకటిరెండు అరవిచ్చిన గులాబీల జన్మకూడా సార్థకం చేశాడు.

కాని, ఆ ప్రణయ సమ్మోహనంలో ఎంతకాలము అవి రేకలువిడకుండా నిలువగలవని చందమామ సర్వజ్ఞుడులాగా నవ్వుతూన్నాడు.

*　　*　　*　　*

వెన్నెల పక్షపాతం వహించిన దోషాన సన్నగిలిపోయే రోజులు వచ్చినవి. మంచుచమకులతో ముత్తైపుతళుకు మాసిపోయిన తరువాత విరికన్నెలకుకూడా తొలిప్రాయము విరిసిపోయినది. గులాబీలకు మొదటి పరువము లేదు.

సుందరం రచనల్లో నవచైతన్యధుని పరవళ్ళుకొడుతూన్నది. కావ్యాత్మ అతని ఆలోచనలన్నీ సొంతం చేసుకుని మనసుజోలికి మరి వేనినీ రానీయడంలేదు.

మరచిపోలేదు...లేదు; కాని మళ్ళా, ఆ అమ్మాయికోసం కలువరించే అలసత్వం దరిజేరడంలేదు. ఆ సంతోషమంతా సంతోషముగానే ఆగిపోయింది...

ఆమెగీతికాలాపాల్లో మును మొలవని రసాంకురములు తలచూపుతున్నవి; కాని అతని చెలిమికి నిలుకడ తీసుకుని వచ్చే కవళికలు లేవు. తళుక్కుమని మెరసి నిలువకుండా మాయమయే చిన్నెలు లేవు. అందరికీ ఆప్యాయంగా కనబడుతుంది; కాని ఆశలూరించదు.

ఒకరినొకరు విడువమనుకుంటూనే విడజాలకుండానే - విడిపోయినారు.

* * * *

గులాబీలు వృంతాల్ని వీడకుండానే వయస్సు కొనసాగించుకుని విడివిడిగా రేకలుగా రాలిపడుతూ జీవనసంధ్యను సమాచీనముగా చేసుకుంటున్న అనుభవజ్ఞులలో అప్పుడప్పుడు తాత్కాలిక విభ్రమాన్ని ప్రవర్తిలజేస్తూంటాయి. అవికూడా ఎప్పటిలాగానే అందవు...అందుకోనీయవు--అలా ఉండిపోవాలిసిందే.

★ ★ ★